వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 136
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఫిబ్రవరి 19, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


8లో..

## రెడ్డిపురంలో చిరుత కలకలం

- భయాందోళనలకు గురవుతున్న కాలనీ వాసులు, రైతులు
- పాదముద్రలు సేకరించిన అటవీశాఖ అధికారులు


వివరాలు2లో..

# చెక్ పడేనా..?

- ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్
- కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు
- విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ నిఘా
- వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్
- అక్రమార్కులకు సహకరించే అధికారులపై వేటు
- వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు

నిన్నమొన్నటి వరకు తోడుకున్నోడికి తోడుకున్నంత అన్న చందంగా సాగిన ఇసుక దందాపై ప్రభుత్వం సీరియస్ గా ఉంది. గోదావరి, ఆకేరుతోపాటు ఇతర వాగుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున తరలిపోతున్న ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఇసుక విషయంలో కఠినంగా వ్యవహరించాలంటూ జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకుగాను మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలకు కూడా ఇసుక తరలిపోకుండా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుక అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇసుక రీచ్ లపై నిఘా పెంచింది. అయితే ఇది మూడు నాళ్ల ముచ్చటలా కాకుండా ప్రభుత్వం సీరియస్ గా అమలు చేస్తే భూగర్భ జలాలు పెరిగి తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి


8లో..

## సమస్యలు పరిష్కరించండి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో రెండో రోజు వినతుల స్వీకరణ


8లో..

## బీఆర్ఎస్‌కు పట్టిన గతే.. కాంగ్రెస్‌కు పడుతుంది

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో బీజేపీదే విజయం
- ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంపీ ఈటల


2లో..

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

- కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- గిరిజన వేషధారణలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య


2లో..

## మార్షల్ ఆర్ట్స్ తో రక్షణ

- పీఎంశ్రీ పాఠశాలల్లో శిక్షణ
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

# చెక్ పడేనా..?



- ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్
- కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు
- విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ నిఘా
- వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్
- అక్రమార్కులకు సహకరించే అధికారులపై వేటు
- వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా సాగుతోంది. కొంత మంది రాజకీయ నాయకుల అండదండలతో పట్ట పగలే అధికారుల కళ్లెదుటే ఇసుక ట్రాక్టర్లు తరలిపోతున్నా చర్యలు చేపట్టకపోవడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇసుకాసురులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తూ కోట్లకు పడగెత్తుతున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరైతే బరితెగించి నెంబర్ ప్లేటు లేని ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ అధికారులకే సవాల్ గా మారుతున్నారు. మరి కొందరు ఒకే నెంబర్ తో రెండు, మూడు వాహనాలను తిప్పుతూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్నారు.

### సీఎం సీరియస్..

ఇసుక అక్రమ రవాణాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. దీనిపై అధికారులతో సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, ప్రస్తుతం పనిచేస్తున్న రీచ్ లను వెంటనే తనిఖీ చేయాలంటూ ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే బాధ్యతలను హైడ్రాకు అప్పగించారు. అదే విధంగా జిల్లాల వారీగా కలెక్టర్లు, ఎస్పీలకు ఆ బాధ్యతలను అప్పగించారు.

### అక్రమాలకు సహకరిస్తే..



గృహ నిర్మాణ రంగం దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుకను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల వారీగా అక్రమాలను అరికట్టే బాధ్యతలను కలెక్టర్లు, ఎస్పీలకు అప్పగించారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదంటూ హెచ్చరించారు. ఈ విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేంది లేదన్నారు. అవసరమైతే తనే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానంటూ చెప్పారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ఇసుక రవాణా జరగాలని, విధి నిర్వహణలో పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

### విజిలెన్స్ నిఘా..

ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ నిఘా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ లో పాటు ఎంట్రీ, ఎగ్జిట్ లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా రవాణాకు సంబంధించి రిజిస్టర్ లారీలను ఎంప్యానెల్ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

### 48 గంటల్లో డెలివరీ..

ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాంతాల వారీగా సమీప రీచ్ లనుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ఉక్కుపాదం పడేనా..

ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ అక్రమంగా ఇసుక రవాణాకు అధికారులు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే అక్రమాలకు అలవాటు పడిన కేడీలు ప్రభుత్వ ఉత్తర్వుల్లోని లూపోల్స్ ను ఆసరాగా చేసుకొని యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇలాంటి కేడీలకు బేడీలు వేసేలా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాల్సిన అవసరం ఉంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం ద్వారా సమీపం ప్రాంతాల్లోని భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ పంటలు పండి ఆయా ప్రాంతాలు సస్యశ్యామలంగా మారుతాయని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.



## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

- త్వరలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- గిరిజన వేషధారణలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ మండలం, శివుని పల్లి గ్రామంలోని పద్మావతి గార్డెన్స్ లో బుధవారం సంత్ సేవలాల్ 286వ జయంతి వేడుకలకు కడియం కావ్యతోపాటు స్థానిక శాసన సభ్యులు కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజన సాంప్రదాయాల ప్రకారం భోగ్ బండార్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీసులతో, వారి మార్గదర్శకంలో గిరిజన బంజారాలు అభివృద్ధి చెందాలన్నారు. బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారన్నారు. జంతుబలులు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్య పరిచిన నేత సంత్ సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన మాట ప్రకారం ఏడాది కాలంలోనే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అధిస్తామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి, రోడ్లు, కమీటిహాల్స్ నిర్మాణానికి తన ఎంపీ లాడ్స్ నుండి నిధులు మంజూరు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. త్వరలో కడియం ఫౌండేషన్ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా కడియం కుటుంబం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా పూజారులు, నాయకులు, బంజారా మహిళలు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్సతో రక్షణ

- పీఎంశ్రీ పాఠశాలల్లో శిక్షణ
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణకు సంబంధించి కరాటే, తదితర మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని డాక్టర్ పీవీ రంగారావు తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి బస చేయగా బుధవారం ఉదయం ఐదు గంటల నుంచి మొదలైన విద్యార్థినుల దైనందిన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులు ఉదయం వేళ వ్యాయామం, యోగా చేయగా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి కలెక్టర్ డైనింగ్ హాలులో అల్పాహారాన్ని తీసుకున్నారు. విద్యార్థినులతో కలిసి అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల వాతావరణం చాలా బాగుందని పేర్కొన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు, కళాశాలకు అదేవిధంగా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువుల్లోనూ, క్రీడల్లోనూ రాణించాలన్నారు. పాఠశాలకు కావలసిన అన్ని మౌలిక వసతులను సమకూర్చుతున్నట్లు పేర్కొన్నారు. స్కూల్, క్లాస్ లీడర్ విద్యార్థినులు బ్యాడ్జీలను ధరించి హుందాగా వ్యవహరిస్తూ తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. విద్యార్థినులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, నోట్ బుక్స్ కలెక్టర్ అందజేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ తో పాటు ఎంఈఓ సునీత రాణి, ప్రిన్సిపల్ అఫ్రీన్ సుల్తానా, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. పీవీ విజ్ఞాన కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం, మ్యూజియం, గ్రీనరీ, పెయింటింగ్, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, ఆర్ట్ గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో మాట్లాడుతూ పీవీ విజ్ఞాన కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ శ్రీను, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డీఈ ధనరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులి రజినీకాంత్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. భారతదేశపు గొప్ప యోధులలో ఛత్రపతి ఒక్కరని కొనియాడారు. హైందవ జాతీ వీరుడని కీర్తించారు. మొగలులను ఎదురించిన నిలిచిన ధీరుడని అన్నారు. కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, డివిజన్ అధ్యక్షులు కనకరాజు, కోటేశ్వర్ రావు, నాయకులు బుద్దె వెంకన్న, రామ్మూర్తి, రఘు, శ్రీనివాస్, అజయ్, రాజు, స్నేహిత్, అభి పాల్గొన్నారు.

# హిందూధర్మ సామ్రాజ్య సంరక్షకుడు ఛత్రపతి శివాజీ

- **ఘనంగా నివాళులర్పించిన మోటే ధర్మారావు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహనీయులను స్మరించుకొని వారి అడుగుజాడల్లోనే నడవాలని హిందూ హృదయ సామ్రాట్.. హిందూ ధర్మ రక్షకుడు.. హిందూ సామ్రాజ్య స్వరాజ్ కోసం రాక్షసుల్లాంటి ఢిల్లీ సుల్తానులతో, మొఘలాయిలతో యుద్ధం చేసి, హిందూ దేవాలయాలను, హిందూ మహిళలను రక్షించి మొఘల్ పాలకుల నుంచి విముక్తి ప్రసాదించిన హిందూ సామ్రాజ్యాధిపతి, చత్రపతి బిరుదాంకితుడు, మరాఠా పోరాట యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ మోటే ధర్మారావు అన్నారు. బుధవారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని శివాజీ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ తల్లి జిజియాబాయి బోధించిన మహనీయుల గాథలు విని అద్భుతమైన మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆపాదించుకుని, తండ్రి షాహజీ ద్వారా పోరాట పటిమను, యుద్ధ విద్యలోని నైపుణ్యాలను అలవర్చుకొని 17 సంవత్సరాల వయసులోని హిందూ ధర్మ సంస్థాపన కోసం నడుం బిగించారని కొనియాడారు. ఔరంగజేబు లాంటి కీచకులు చత్రపతి శివాజీ మహారాజును ఆయన కొడుకుని చంపాలని ప్రయత్నించిన ఆయన తప్పించుకుని తిరిగి ఔరంగజేబుపైన



యుద్ధం ప్రకటించి హిందూ సామ్రాజ్య విస్తరణ కోసం, హిందూ అభివృద్ధి కోసం, హిందూ మహిళల ఔన్నత్యాన్ని పెంచడం కోసం, మొఘలాయిలతో తీవ్రమైన పోరాటం చేశాడన్నారు.

# భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు శివాజీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయలు అచ్చ సుదర్శన్ పూలమాలవేసి నివాళులర్పించారు. భారతదేశాన్ని ఎందరో రాజులు ఏలినప్పటికీ ఈ లక్షణాలే శివాజీని గొప్ప రాజుగా చేశాయని చెప్పారు. అంతేకాకుండా యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్ర గణ్యుడని, మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడని, ప్రజల సంక్షేమం కోసమే పాటుబడిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. ఉపాధ్యాయులు బత్తుల రవీందర్, లకావత్ దేవా, కంచరాజు కుమార్ అంగన్వాడీ టీచర్స్ భీముడీ లక్ష్మి, నందిపాటి సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## డోర్నకల్ లో భారీ ర్యాలీ..



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలుల వేసి నివాళుర్పించి ఆయన దేశానికి, హిందూ ధర్మ పరిరక్షణకు చేసిన సేవలను కొనియాడారు. కోట్లాది మంది భారతీయులకు స్పూర్తిదాయకుదన్నారు.

# స్పూర్తిదాయకుడు ఛత్రపతి శివాజీ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపాలిటీలో చత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతి సందర్భంగా భారీ ర్యాలీ , పుష్ప దండలతో శివాజి జయంతి వేడుకలు జరుపుకోవడం జరిగింది. కోట్లాది మంది భారతీయులకు స్పూర్తిదాయకుడు, మరాఠాయోధుడు శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహావీరుడి దివ్యస్మృతికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శివాజీ మహారాజ్ అభిమాన సంఘం నాయకులు, పనీకర రాహుల్ రాయ్(బంటి), తంగేళ్లపల్లి అన్వేష్, సట్ల చరణ్ (చంటి), తూర్పాటి మెండీస్, బసనబోయిన రాజకుమార్, ఆబోతు మధు యాదవ్, శివ మణి, అన్వేష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి శివాజీ జయంతి



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో ఆరే సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు ఏండిగ నగేష్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షుడు లోకటి నగేష్ చేతుల మీదుగా శివాజీ విగ్రహానికి పూలమాలవేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మలహలరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుడ్ల రవి, ఉపాధ్యక్షులు లోకటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుడ్ల యుగేందర్, వాంకే రాజయ్య, కుడ్ల సంజీవరావు, ఇరువాల కృష్ణకాంత్, దిలీప్, వాంకే రాజు, మోకిడి రాజు, కుడ్ల రాము, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచికలపేటలో..



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని పెంచికలపేట గ్రామంలో చత్రపతి శివాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి ఉత్సవాలు నిర్వహించి హిందూ బంధువులందరికీ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్న కృష్ణ ఆధ్వర్యంలో సురక్ష వలంటరీ బ్లడ్ బ్యాంక్ లో రక్తదాన చేశారు. ట్రస్ట్ సభ్యులు 30 యూనిట్ల బ్లడ్ ను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, సముద్రాల రవి, కుండె కృష్ణంరాజు, బలవంతుల రాజు, అల్లి మహేందర్, వేల్పుగొండ రవి, కందకట్ల రమేష్, మంగరాజు, బొల్లికొండ వెంకటేశ్వర్లు, కొలగాని సుధాకర్, కందకట్ల సదానందం, మంగ సందీప్, గోవిందు, అఖిల్, మంగ మల్లికార్జున్, న్యాతి మహే,ష్ మంగ నితిన్, ట్రస్ట్ సభ్యులు, రక్త దాతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఛత్రపతి శివాజీ 395వ, జయంతి వేడుకలను శాయంపేట మండల కేంద్రంలో హుస్సేన్ పల్లి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆరే సంఘం మండల అధ్యక్షుడు దోర్నాల రాజు, గుజ్జుల రాజులు శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ భారతదేశ మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన మరాఠా వీరుడు శివాజీ అని కొనియాడారు. స్త్రీని గౌరవించి హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడని, భరతమాత ముద్దుబిడ్డ అని కీర్తించారు. ఆయన సేవలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరే సంఘం గౌరవ అధ్యక్షుడు ఇటుకల పాపారావు, ఆరే సంఘం ఉపాధ్యక్షులు మోకిడే మహేందర్, గ్రామాల అధ్యక్షులు రాజేశ్వరరావు, రాజు, రవీందర్, కిషన్, రాజేందర్, శ్రీనివాస్, బాబురావు, మల్లయ్య, నరసింగరావు, కిషన్ రావు, మాది సర్పంచ్ గుండెకారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని శ్రీ సాయి, జగదాంబ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన రైస్ మిల్లులోని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన జిల్లా లక్ష్యం ప్రకారం కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీలను షెడ్యూల్ ద్వారా వెంటనే చేయాలన్నారు. ఖరీఫ్ 2024 -25 కు సంబంధించి సీఎంఆర్ లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వేగంగా చేయాలని మిల్లర్లను ఆదేశించారు. మిల్లులకు సంబంధించి పూర్తి వివరాల రికార్డులను క్రమం తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖలు నిత్యం రైస్ మిల్లులను తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# నామినేటెడ్ పదవి ఇవ్వాలని మంత్రిని కలిసిన మహేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగర పరిధిలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ బుధవారం హనుమకొండ రాంనగర్ నివాసంలో అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి నామినేటెడ్ పదవి ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తప్పకుండా ఈ విషయంలో చొరవ తీసుకొని బాధ్యత గల నామినేటెడ్ పదవి ఇప్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు పులిచేరి రాధాకృష్ణ, సౌరం అభిలాష్, కోగిల సుధాకర్ పాల్గొన్నారు.

# కలగానే ఎన్ హెచ్ఎం ఉద్యోగుల రెగ్యులరైజేషన్

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్**



**వరంగల్ వాయిస్, సంగారెడ్డి :** నేషనల్ హెల్త్ మిషన్ లో 2000 నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40శాతం కేంద్ర రాష్ట్రాలు కలిపి 100 శాతం నిధులతో ఎన్ హెచ్ఎం ఉద్యోగులను నడిపిస్తున్న ప్రభుత్వాలు ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులను దేశవ్యాప్తంగా పట్టణ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ద్వారా వివిధ భాగాలలో ఉద్యోగులను నియమించింది. నాటి నుంచి నేటి వరకు అరకొర వేతనాలతోనే కుటుంబాలను నడిపించుకుని నడిపించుకోలేక నేటి వరకు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ అని ముద్దు పేరు పెట్టిన ప్రభుత్వాలు వారి తోటి ఇన్ని సంవత్సరాలు వెట్టిచాకిరి చేపించుకున్నారే తప్ప వారిని మాత్రం ప్రభుత్వ ఉద్యోగులుగా నేటి వరకు గుర్తించలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏ ఒక్క రాజకీయ ప్రభుత్వం కానీ కేంద్రంలో గాని రాష్ట్రంలో గాని ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను క్రమబద్ధీకరణ కాకపోగా మొన్న అధికారంలో ఉండి పోయిన బీఆర్ఎస్ పార్టీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ మాటే ఉండదని, అందరూ ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉంటారని చెప్పిన కేసీఆర్ కూడా మాట తప్పారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ డిమాండ్ చేశారు..

# ఇసుకాసురులపై ఉక్కు పాదం

**చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన కలెక్టర్**



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపింది. బుధవారం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిలో గల రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జనగామ జిల్లా డీసీపీ రాజ మహేందర్ నాయక్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై నిఘా పూర్తిస్థాయిలో పెట్టి ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కోరారు. లారీల్లో ఓవర్ లోడ్ తో వెళ్తున్న ఇసుక లారీలను చెక్ చేయాలని వారు ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడిన లారీలను సీజ్ చేయాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్ఐ నరేష్, కానిస్టేబుళ్లు యుగంధర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కేయూ వీసీని కలిసిన విద్యార్థి సంఘాలు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప రెడ్డిని బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యూనివర్సిటీలో ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నూతనంగా ఓఎస్డీగా నియమించబడిన ప్రొఫెసర్ మల్లారెడ్డిని తక్షణమే తొలగించాలన్నారు. ఆయనకు ఎలాంటి పరిపాలన పదవులు ఇవ్వకూడదన్నారు. ఎస్డీఎల్సీ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్)లో కౌన్సిలర్లను వెంటనే నియమించాలని, పీహెచ్డీ పూర్తి చేసిన లేదా పరిశోధన చేస్తున్న విద్యార్థులను కౌన్సిలర్లుగా నియమించాలన్నారు. తరగతులు బోధించేందుకు పీహెచ్డీ పూర్తిచేసిన డాక్టరేట్లకు, పరిశోధకులకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్డీఎల్సీ బలోపేతం చేయడానికి, పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి, అడ్మిషన్లు పెంచడానికి ప్రతి జిల్లాలో ఎగ్జామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి, పీహెచ్డీ డాక్టరేట్లను, అలాగే పరిశోధక విద్యార్థులను అబ్జర్వర్లుగా నియమించాలన్నారు. పరిశోధక విద్యార్థులకు స్కూటినీ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. పార్ట్‌టైమ్ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ డిమాండ్లను వెంటనే అమలు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ముఖ్యంగా ఓఎస్డీ మల్లారెడ్డిని వెంటనే తొలగించకపోతే యూనివర్సిటీ బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు పరిపాలనా భవనం ముందు టెంట్ వేసి ఉద్యమాలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఇంచార్జి డాక్టర్ వద్దేపల్లి మధు, బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి జెట్టి రాజేందర్, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, కుడా జనరల్ సెక్రటరీ డాక్టర్ మద్దిరాల మోహన్ రెడ్డి, కుర్రా బాద్యులు సోమరాజు, విష్ణు, పరిశోధక విద్యార్థులు కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నేర రహిత సమాజమే ధ్యేయం

**ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నేర రహిత సమాజమే మన అంతిమ ధ్యేయమని, నేర శాతం తగ్గింపుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలో పని చేస్తున్నామని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ మహబూబాబాద్ జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత పోలీస్ స్టేషన్ వారీగా నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డీఎస్పీలు తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను సందర్శించి, వారి పనితీరు సమీక్షించాలని, తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. గంజాయి సరఫరా మరియు వినియోగం మీద ఉక్కుపాదం మోపాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించారు.



# దేశవ్యాప్త కులగణన, బీసీ రిజర్వేషన్లకై పోరాటాలకు సిద్ధం



● బీసీ హక్కుల సాధన సమితి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దేశ జన గణనలో ఓబీసీ కులగణన జరపాలని చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సమైక్య పోరాటాలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం పిలుపునిచ్చింది. హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, తెలంగాణ రాష్ట్ర చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ తాటి వెంకటేశ్వరరావు, నేదునూరి రాజమౌళి, లౌడంగి శ్రవణ్ కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, యేశాల అశోక్, సీహెచ్.దశరథ్, పెరుగు కుమార్, చింతకింది కుమారస్వామి, విజయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు, ధూళిపాళ ధనుంజయ నాయుడులు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా శాసనసభ సమావేశాలు నిర్వహించి జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి కేంద్రానికి వెంటనే పంపాలని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించి చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాని మోడీ బీసీ అని మాటిమాటికి చెప్పే రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీసీల డిమాండ్స్ ను ఆమోదింపచేయనిచో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్ లోని హామీలన్నింటిని అమలు పరచాలని, లేకుంటే బీసీల విశ్వసనీయతను కోల్పోవలసి వస్తుందని హెచ్చరించారు. బీసీ హక్కుల సాధన సమితి సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టి గ్రామ మండల మహాసభలు మే నెలాఖరుకు పూర్తి చేసి, జూన్ లో జిల్లా, జూలైలో రాష్ట్ర మహాసభలు నిర్వహించేందుకు కార్యక్రమాన్ని రూపొందించినట్లు వారు తెలిపారు.

# సమన్వయంతో మహా శివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయాలి



● అదనపు కలెక్టర్ సంపత్ రావు

**వరంగల్ వాయిస్, ములుగు :** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహా శివరాత్రి మహోత్సవాలు విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం.సంపత్ రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా డీఎస్పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో, ఆయా శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం.సంపత్ రావు జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, హెల్ప్ సెంటర్ ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల పై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 28 వరకు మహా శివరాత్రి మహోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, రామప్పకు వచ్చే అన్ని రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చలి వేంద్రాలను, చలువ పందిరిలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కాకుండా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ల వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# నిర్దిష్ట గడువులోగా 'స్మార్ట్' పనులు పూర్తి

➲ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
➲ హనుమకొండ పరిధిలోని స్మార్ట్ రోడ్ల పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్మార్ట్ సిటీ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా జీడబ్ల్యూఎంసీ పరిధిలోస్మార్ట్ సిటీ పథకం కింద కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా టీచర్స్ కాలనీ ఫేజ్ -1 లో సీసీ రోడ్ ను, వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనులు, 52 వ డివిజన్ రాజాజీ నగర్ కల్వర్టు పనులు, నయీంనగర్ లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, పద్మాక్షి టెంపుల్ రోడ్డు, సీసీ డ్రైన్ పనులను కమిషనర్ కొలతల ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, డీఈలు రవి కిరణ్, అజ్మీరా శ్రీకాంత్, స్మార్ట్ సిటీ సీఎంసీ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

**నిధులు సద్వినియోగం చేసుకోండి..**

స్మార్ట్ సిటీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ



మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ ఎఫైర్స్ జాయింట్ సెక్రెటరీ రూపా మిశ్రా అన్నారు. దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా ఎంపికైన నగరాల మేనేజింగ్ డైరెక్టర్లు, కమిషనర్లు, అధికారులతో జాయింట్ సెక్రటరీ బుధవారం దృశ్య మాధ్యమం ద్వారా స్మార్ట్ సిటీ పథకం కింద నిధుల కేటాయింపు, వినియోగంపై ఢిల్లీ నుంచి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగరం నుంచి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొని స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను మార్చి 2025 నాటికి పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాయపర్తి మండల కేంద్రంలో అంబేద్కర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు ఐత రాకేష్ తండ్రి ఐత ఎల్లయ్య బుధవారం అనారోగ్యంతో మరణించాడు. కాగా ఆయన మృతదేహానికి బీ ఆర్ ఎస్ నాయకులూనివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పరుపటి శ్రీనివాస్ రెడ్డి సహాయంతో వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. రాయపర్తి బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాయపర్తి మాజీ సర్పంచ్ గారే నర్సయ్య దానిని అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు అశ్రఫ్ పాషా, మండల పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్లస్వామి, మండల పార్టీ నాయకులు ఐత కుమార్, మండల పార్టీ నాయకులు ఐత రాజు, ఐత మల్లేష్, పిరని రాజు, ఐత రవి, గారే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దూర విద్య పీజీ మొదటి సెమిస్టర్ పరీక్ష మార్చి 5కు వాయిదా


**వరంగల్ వాయిస్, కేయూ :** ఈ నెల 27న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా జరగవలసిన దూర విద్య పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షను మార్చి 5కి వాయిదా వేస్తునట్లు, మిగితా పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యధావిధిగా జరుగుతాయని తెలియచేస్తూ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు.

# నరేందర్ రెడ్డిని గెలిపించండి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలో కరీంనగర్-అదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఉటుకూరి నరేందర్ రెడ్డి గెలుపు కోసం కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి-రవీందర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పట్టభద్రుల ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తడక శ్రీకాంత్, విష్ణుదాసు వంశీధరావు, శనిగరపు రమేష్, పుల్ల సునీల్, వైనాల సుభాష్, మాట్ల రాజేష్, శనిగరపు దినేష్, పుల్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి ఎమ్మెల్యేతో కుడా చైర్మన్ ఇనగాల భేటీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి చొప్పదండి మండల కో ఆర్డినేటర్ గా నియామకమైన సందర్భంగా బుధవారం చొప్పదండి శాసనసభ్యుడు డాక్టర్. మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి ఎన్నికల కార్యాచరణ గురించి చర్చించారు. వారితో పాటు కరీంనగర్ సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కూడా కలిశారు.

# కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్




- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి
- కేంద్ర బడ్జెట్ లో వివక్షపై నిరసన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపై బుధవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్ లో వామపక్ష పార్టీల చేతికి సంకెళ్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణా పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. ఏపీ పునర్విభజన చట్టం అమలును బీజేపీ నిర్లక్ష్యం చేసిందని, నిర్లక్ష్యానికి గురైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులోని తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించలేదన్నారు. లక్షలాది మంది యువకులకు ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రాజెక్టును మూలకు పడేయడం దారుణమన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న అసమానతలు, ప్రాంతీయ అసమానతలు భారత ప్రజలు ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యలు అయినప్పటికీ బడ్జెట్ వాటిని పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. భారతీయ రూపాయి విలువ మునుపెన్నడూ లేనంత కనిష్ట స్థాయికి పడిపోయిందని, విదేశీ రుణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ లో పేదరికం శూన్యం అని చెప్పినా వాస్తవానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో మరోసారి తెలంగాణాకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తెలంగాణకు బడ్జెట్ లో సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్.జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, బత్తిని సదానందం, మాలోతు శంకర్ నాయక్, సుదర్శన్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, రొంటాల రమేష్ దేవా, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, సీపీఎం జిల్లా నాయకులు ఎస్.వాసుదేవ రెడ్డి, ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వీరన్న నాయక్, జి.రాములు, సాంబయ్య, ఆర్ఎస్పీ జిల్లా నాయకులు కె.శివాజీ పాల్గొన్నారు.

# కూరపాటి లింగన్న సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్ టీయూ జాతీయ నాయకుడు కామ్రేడ్ కూరపాటి లింగన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం ఐఎఫ్ టీయూ, ఇతర ప్రజా సంఘాల నాయకులు, సహచరులు, కాశిబుగ్గ జంక్షన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ లింగన్న చిన్నతనం నుంచే విప్లవ భావాలు కలిగి ఉండేవాడని, తను ఆజం జహీ మిల్లులో టైపిస్టుగా పనిచేస్తూనే నగరంలో బీడీ, ప్రింటింగ్, బైండింగ్ వర్కర్స్ హమాలీ కార్మికులతో సంఘాలు ఏర్పాటు చేసి వారి సమస్యల సాధనకు పని చేశాడన్నారు. లింగన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అనేక జిల్లాల్లో కార్మిక ఉద్యమాలు నిర్మించాడని, ఈ క్రమంలో అక్రమ కేసులు చిత్రహింసలు నిర్బంధాలను ఎదుర్కొని భావితరాల విప్లవ కార్మిక ఉద్యమానికి దారి చూపించాడని వారు అన్నారు. గత సంవత్సరం అనారోగ్య మూలంగా మరణించాడని అతని ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. ఈ నివాళి కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, రాచర్ల బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇనుముల కృష్ణ, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గంద్రతి హరికృష్ణ, డాక్టర్ కొనతం కృష్ణ, గంజి సాంబయ్య, పెరుమాళ్ల లక్ష్మణ్, సురేష్, టీఎస్ స్వామి, మాటేటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను సవరించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తయారు చేసిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేయాలని 10 కమ్యూనిస్టు విప్లవ పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో వివిధ వామపక్ష విప్లవ పార్టీల నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా అనంతరం జరిగిన కార్యక్రమానికి న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల యాకర్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఎంసీపీఐ యూ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఎస్ యూసీఐ నాయకులు, సత్యనారాయణలు మాట్లాడారు. ఎల్ఐసీ 100శాతం ప్రైవేట్ పరం చేయడాన్ని, ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటు పరం చేయడం ఆపివేయాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50 శాతం నిధులు పెంచాలని, జీడీపీలో విద్య, వైద్య రంగాలకు మూడు శాతం నిధులు అదనంగా ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థకు సబ్సిడీలు




పెంచాలని, ఎస్సీ, ఎస్టీ రంగాలకు మహిళా శిశు సంక్షేమ శాఖలకు అధిక నిధులు కేటాయించాలని, పెట్రోలియం ఉత్పత్తులపై పెంచిన పనులను తగ్గించాలని తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని, విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ బషీర్, ఆడెపు సదయ్య, పనస ప్రసాద్, ఐతం నగేష్, టి.భవాని, దుర్గయ్య, ఇనుముల శ్రీనివాస్, రంజిత్, గన్నారపు రమేష్, గంద్రతి హరిబాబు, ప్రశాంత్, మాలి ప్రభాకర్, దేశెట్టి సమ్మయ్య, మధు, సురేష్, వాణి, ఉదయశ్రీలతో పాటు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిషేధిత గడ్డి మందుతో ఎండిన వరి పొలం

## ఎరువుల షాప్ ఎదుట బాధిత రైతు ఆందోళన



**వరంగల్ వాయిస్, మల్హర్ :** ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును ఓ రైతు పిచికారీ చేయడంతో రెండు ఎకరాల పొలం పూర్తిగా ఎండిపోయి చనిపోయిన సంఘటన మండల కేంద్రమైన తాడిచెర్ల ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల పూర్తి కథనం ప్రకారం తాడిచెర్ల గ్రామానికి చెందిన శ్రీసాయి పెర్టిలైజర్ అండ్ పెస్టి సీడ్స్ దుకాణ యజమాని శ్రీనివాస్ ఇదే గ్రామానికి చెందిన మేనం మొగిలి అనే రైతుకు ఇటీవల ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయించాడు. రైతు తనకున్న రెండు ఎకరాల పొలంలో కలుపు మొక్కలు పోవడానికి పది రోజుల క్రితం పిచికారీ చేయగా మరుసటి రోజు నుంచి పొలం అంతా ఎండిపోయి చనిపోతుండగా బాధిత రైతు వెంటనే ఎరువుల షాప్ యజమాని వద్దకు వెళ్లి అడుగగా మొదట ఎరువుల వ్యాపారి నాకు సంబంధం లేదని తెలుపగా గ్రామస్తులు సహకారంతో రైతు మరోమారు గట్టిగా నిలదీయగా గడ్డిమందు అమ్మింది వాస్తవమేని ఒప్పుకొని రూ.50 వేలు నష్టపరిహారం ఇస్తామని రైతుతో ఒప్పందం చేసుకొని ఇవ్వకపోవడంతో బాధిత రైతు మంగళవారం ఎరువుల దుకాణం ముందు బైఠాయించి, ఆందోళన చేపట్టాడు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారులు స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

# బహుజన నేతలను టార్గెట్ చేసిన కాంగ్రెస్

## ఉదిత్ రాజ్ ను అరెస్ట్ చేయాలి

## బీఎస్పీ పాలకుర్తి అసెంబ్లీ అధ్యక్షుడు ఈదునూరి ప్రసాద్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కాంగ్రెస్ పార్టీ బహుజన నాయకులను టార్గెట్ చేసిందని పాలకుర్తి మండలంలోని లక్ష్మి నా రా య ణ పు రం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో బీఎస్పీ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి ప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను అడుగడుగున అవమానించిన కాంగ్రెస్ నేడు బహుజన నాయకులను టార్గెట్ చేసిందన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ బెహెన్ జి కుమారి మాయావతిని చంపేయాలన్న కాంగ్రెస్ నేత ఉదిత్ రాజు, కాంగ్రెస్ నీచ రాజకీయాలను బహుజన సమాజం చూస్తూ ఊరుకోదన్నారు. నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ పై రాళ్లు వేసిన చరిత్ర కాంగ్రెస్ దని.. నేడు బహుజన సమాజాన్ని రాజ్యాధికారం దిశగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను చైతన్యవంతం చేస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ బెహన్ జి కుమారి మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు మౌనంగా ఉండటంలో అర్థమేమిటని ప్రశ్నించారు. జై భీమ్, జై మండల్ అనుకుంటున్న కాంగ్రెస్ ఆ నినాదాల వెనుక దళితులపై కుట్ర చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ బండిపెల్లి యాదగిరి, తుటి భాస్కర్, చిటూరీ ప్రభాకర్ మహారాజ్, రమేష్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి నాగుర్ల పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోర్నే శంకరరావు కుటుంబాన్ని గురువారం మాజీ రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరె సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, రాష్ట్ర నాయకుడు జండా రాజేష్, నడికూడ ఆరే సంఘం మండల అధ్యక్షుడు లోకటి నగేష్, ఉపాధ్యక్షుడు లోకటి శ్రీనివాస్, రైతు రక్షణ కమిటీ మండల అధ్యక్షుడు వాంకేరాజు, బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు రాకేష్, మోకిడి రాజు పాల్గొన్నారు.

# రెండో సినిమా పాన్ ఇండియా హీరోతో


## దూసుకెళ్తున్న ప్రీతి ముకుందన్



టాలీవుడ్ ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. అలా టాలీవుడ్‌కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ఇప్పుడు కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుందన్ మంచు విష్ణు హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్ ను ప్రారంభించింది. ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్ గా మారింది. 'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది.  సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫొటోలు చుస్తే నోరెళ్లబెట్టాల్సిందే.. ఈ ఫొటోలకు కుర్రాళ్ళు రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు.

# ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నా

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను బయటపెట్టేసింది సహజనటి సాయిపల్లవి. ఆమెకు జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉందట. దానికి బలమైన కారణం కూడా ఉందట. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ 'పెళ్లప్పుడు కట్టుకోమని మా మామ్మ నాకు ఓ చీర ఇచ్చింది. అప్పుడు నాకు 21ఏళ్లు. అప్పటికింకా నేను సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వలేదు. అసలు ఆ ఆలోచనే లేదు. పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామని ఆ చీర దాచుకున్నాను. కొనేళ్లకు అనుకోకుండా 'ప్రేమమ్'తో నటిని అయ్యాను. 'ఫిదా'తో మంచి పేరొచ్చింది. ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్టాత్మక అవార్డు కూడా అందుకుంటాననే నమ్మకం వచ్చింది. అందుకే.. జాతీయ అవార్డు అనేది నిజంగా నాకొస్తే.. అప్పుడు మా మామ్మ ఇచ్చిన చీర కట్టుకొని ఆ అవార్డు అందుకోవాలి అని నిశ్చయించుకున్నా. నిజంగా అవార్డు వచ్చినా, రాకపోయినా.. ఆ చీర ధరించే వరకూ ఆ ఒత్తిడి మాత్రం నన్ను వదలదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి. నిజానిక్కూడా ఈ దఫా సాయిపల్లవికి నేషనల్ అవార్డు పక్కా అని పలువురి అభిప్రాయం. 'అమరన్'లోని ఆమె నటనకు తప్పకుండా అవార్డు వస్తుందని చాలామంది నమ్ముతున్నారు. అదే జరిగితే సాయిపల్లవి ఒత్తిడీ తీరుతుంది. అభిమానుల ఆకాంక్షా నెరవేరుతుంది.



# ఎర్రచీరలో.. దేత్తడి హారిక



దేత్తడి హారిక.. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. యూట్యూబ్ స్టార్ గా తెలుగు రాష్ట్రాల్లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలంగాణ యాసలో మాట్లాడుతూ.. యూట్యూబ్ లో అందరికీ ఇచ్చిపడేసే వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ దేత్తడి హారిక. సోషల్ మీడియా ద్వారా వచ్చిన క్రేజ్ తో ఈ చిన్నది బిగ్ బాస్ గేమ్ షోలో అవకాశం అందుకుంది. నాగార్జున హోస్ట్ గా చేసిన బిగ్ బాస్ సీజన్ 4లో కంటెస్టెంట్ గా పాల్గొంది. హౌజ్‌లో తనదైన అల్లరి పనులతో టాప్ 5లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా తన ఇంస్టాగ్రామ్ అకౌంటులో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది ఈ భామ. 9 సెప్టెంబర్ 1997న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది అందాల తార అలేఖ్య హారిక. ఈ బ్యూటీకి వంశీ కార్తీక్ అనే ఒక సోదరుడు కూడా ఉన్నాడు. సోషల్ మీడియాలో ఈ చిన్నదాన్ని ఫాలో అయ్యేవారి సంఖ్య ఎక్కువే..  హైదరాబాద్ లోని ఓ పాఠశాలలో స్కూలింగ్ విద్య పూర్తిచేసింది. మెహదీపట్నంలో ఉన్నసెయింట్ ఆన్స్ కళాశాల నుంచి బ్యాచలర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి డిగ్రీ పట్టా పొందింది ఈ వయ్యారి భామ. అలేఖ్యకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై మక్కువ ఎక్కువ. చిన్నప్పటి నుంచి కొరియోగ్రాఫర్ కావాలని కోరిక. 2015లో ఆమె హైదరాబాద్‌లోని అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. అలేఖ్య దాదాపు మూడు సంవత్సరాలు అక్కడ పని చేసింది. ఆతర్వాత సోషల్ మీడియాలో పాపులర్ అయ్యింది. కొన్ని సినిమాల్లోనూ నటించింది. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ లోనూ నటించింది దేత్తడి హారిక.

# ఆర్‌సీ16ని నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్తున్న బుచ్చిబాబు



అగ్ర హీరో రామ్‌చరణ్‌కి ఇమిడియట్‌గా హిట్ కావాలి. దర్శకుడు బుచ్చిబాబు సాన ద్వితీయ విఘ్నాన్ని అధిగమించాలి. అందుకే వారిద్దరికీ 'ఆర్‌సి 16'(వర్కింగ్ టైటిల్) కీలకం. ప్రీప్రొడక్షన్ నుంచే ఈ సినిమాపై బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరచడానికి కారణం అదే. క్రీడా నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. తాజాగా ఈ సినిమా కథకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందట. ఈ ఎపిసోడ్ సినిమాలో కీ రోల్ పోషిస్తుందని టాక్. అందుకే ఈ ఎపిసోడ్‌ని ఎమోషనల్‌గా ప్లాన్ చేశాడట బుచ్చిబాబు. రీసెంట్‌గా విడుదలైన రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్'లోనూ ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉన్న విషయం తెలిసిందే. ఆ ఎపిసోడ్‌పై ఆడియన్స్‌లో మిశ్రమ స్పందన వచ్చింది. కానీ 'ఆర్‌సి 16' ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ని మాత్రం నెక్ట్స్ లెవల్‌లో ప్లాన్ చేశారట బుచ్చిబాబు.  జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే.

# సమస్యలు పరిష్కరించండి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో రెండో రోజు వినతుల స్వీకరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హనుమకొండ రామ్ నగర్ లోని తమ నివాసంలో వరుసగా రెండో రోజు బుధవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని వివిధ వర్గాల ప్రజలు మంత్రిని నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి సురేఖ సహృదయంతో విన్నారు. వారి సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార నిమిత్తం మున్సిపల్, రెవెన్యూ తదితర విభాగాలకు చెందిన పలువురు అధికారులతో మాట్లాడారు. అవసరార్థులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా ప్రజలు తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. ప్రజలకు ఎల్లవేళలా కొండా దంపతులు అందుబాటులో ఉంటారని కార్యకర్తలకు, నాయకులకు ఏ ఆపద వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ వారికి భరోసా ఇచ్చారు.



## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..


లేబర్ కాలనీ నుంచి వెంకట్రామ జంక్షన్ వరకు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ దిశగా మంత్రి స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని కోరుతూ టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి కొండా సురేఖ ఆర్ అండ్ బి అధికారులకు లిఖిత పూర్వకంగా లేఖ రాయడంతోపాటు వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారని మీసాల ప్రకాశ్ వెల్లడించారు.

## అర్బన్ పరిధిలోనే రిజిస్ట్రేషన్లు..

ఖిలవరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలోని ఖిలవరంగల్ మండలంతో పాటు, కాశిబుగ్గ, రామన్నపేట, దేశాయిపేట, ఏనుమాముల, చింతల్, ఉర్సు, రంగశాయిపేట, ఐలోని మండలంతో కూడుకున్న ప్రాంతాలను, వరంగల్ తూర్పు ప్రజలకు అందుబాటులో ఉండేలా అర్బన్ పరిధిలోని రిజిస్ట్రేషన్లు చర్యలు తీసుకోవాలని, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ బుధవారం రాంనగర్ లోని మంత్రి స్వగృహంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు స్పందించిన మంత్రి తక్షనమే రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుద్ద ప్రకాష్ కు ఫోన్ ద్వారా సమస్యను తెలిపారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ తో పాటు పలువురు న్యాయవాదులు, దస్తవేజు లేకరులు మంత్రి సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రెడ్డిపురంలో చిరుత కలకలం

- భయాందోళనలకు గురవుతున్న కాలనీ వాసులు, రైతులు
- పాదముద్రలు సేకరించిన ఆటవీశాఖ అధికారులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నగరానికి కూతవేటు దూరంలోని రెడ్డిపురం విజయలక్ష్మి కాలనీలో చిరుత కలకలం సృష్టించింది. మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డుకావడంతో కాలనీ వాసులు ఒక్కసారి ఉలిక్కి పడ్డారు. రెడ్డిపురంలోని మున్నూరు కాపు భవన్ వెనుక ఉన్న సత్యనారాయణ ఇంటి పరిధిలో రాత్రి సుమారు 10.02 గంటలకు చిరుత శబ్దం చేసినట్లు గృహ యజమానులు గ్రహించారు. దీంతో భయాందోళనలకు గురైన వారు అనుమానంతో సీసీ పుటేజీ చెక్ చేయగా ఆయా పరిసరాల్లో సంచరించడంతో పాటు కాంపౌండ్ వాల్ ఎక్కుతూ చిరుత కనిపించింది. దీంతో వారు ఒక్కసారి ఉల్లిక్కి పడ్డారు. వెంటనే కాలనీవాసులకు సమాచారం ఇవ్వడంతో కాలనీ వాసులు, రైతులు భయబ్రాంతులకు గురి అవుతున్నారు. యాదవ్ నగర్ రైతులు రెడ్డి పురం చుట్టుపక్కల ఉన్న పొలాల దగ్గరికి వెళ్లాలంటే భయపడుతున్నారు.

## పాదముద్రల సేకరణ..

రెడ్డిపురంలో చిరుత సంచరించినట్లు వస్తున్న వార్తలతో అటవీ శాఖ అధికారులు స్పందించారు. సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని సీసీ పుటేజీ ఆదారంగా చిరుత సంచరించిన ప్రాంతాలను కలియ తిరిగారు. అదే విధంగా చిరుత పాదముద్రలను స్వీకరించారు. వాస్తవాలు తెలిసే వారకు ప్రజలు అప్పమత్తంగా ఉండాలంటూ అటవీశాఖ అధికారులు సూచించారు.

# శివాజీ చరిత్రను బోధించాలి

- సామాజిక వెత్త నిమ్మల శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పోరాట ప్రతిమతో 17 ఏళ్ల చిరుప్రాయంలోనే ప్రాణాలకు తెగించి అనేక యుద్ధాలు చేసి సామ్రాజ్యాలను గెలుస్తూ కోటలను స్వాధీనం చేసుకుంటూ అత్యంత బలమైన మొఘల్ సామ్రాజ్య నేతలను మట్టి కరిపించిన యోధుడు 'చత్రపతి శివాజీ'అని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి అర్పించి మాట్లాడుతూ తల్లి జిజియాబాయి శివాజీకి చిన్నతనంలోనే పుట్టిన మాతృభూమిపై భక్తి, తోటి ప్రజలపై ప్రేమ, అభిమానం, విలువలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించిందన్నారు. క్రమశిక్షణతో మెలగటం అనేక వీరుల గాధలను కథల రూపంలో చెప్పటంతో అతనిలో దేశభక్తిని పెంపొందించటానికి ముఖ్య కారణం అయిందన్నారు. ఆ స్ఫూర్తితోనే సమాజంలో జరిగే అన్యాయాలను చిన్ననాటి నుంచే ఎదిరించే ధోరణి పెరిగిందని, ఆనాడు మొఘల్ సామ్రాజ్యాన్ని వారి దురాగతాలకు చమర గీతం పాడి భారత దేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించటానికి పునాది ఏర్పడిందన్నారు. ప్రతీ భారతీయుడు ఆ మహానుభావుని చరిత్రను తెలుసుకోవాలని, ఉపాధ్యాయులు కూడా వారి గాధలను విద్యార్థులకు బోధించాలని ఆయన కోరారు.



# బీఆర్ఎస్ కు పట్టిన గతే.. కాంగ్రెస్ కు పడుతుంది

ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో బీజేపీదే విజయం

ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంపీ ఈటల



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్య వ్యవస్థలను కేసీఆర్ బ్రష్టు పట్టించారని, అదే తరహాలో కాంగ్రెస్ నడుస్తోందని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆరోపించారు. బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారానికి పోతే సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. కేంద్రం గ్రీన్ ఫిల్డ్ హైవేలను విస్తరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. పార్లమెంట్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు కంటే మూడు రెట్లు అధికంగా చెల్లించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రీన్ ఫిల్డ్ భూ నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గ్రీన్ ఫిల్డ్ హైవే పనులు వేగంగా జరుగుతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించకుండా కేంద్రం పై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దీంతో రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళ్లు తెరవాలని ఈటల విజ్ఞప్తి చేశారు. సర్వే మళ్లీ చేయాలన్నారు. లేదంటే రైతుల తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## దేశ వ్యాప్త కులగనణ సాధ్యం కాదు..

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై బీజేపీ పోరాటం చేస్తుందని ప్రకటించారు. కులగననకు బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. అయితే దేశ వ్యాప్తంగా కులగనణ చేసే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో బీసీలు ఉన్న వారు ఇతర రాష్ట్రాల్లో ఓసీలుగా, ఎస్సీలుగా ఉన్నారని, అక్కడ ఓసీలుగా ఉన్న వారు ఇక్కడ బీసీలుగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపత్యంలో రాష్ట్రాల వారీగా కుల గనణ జరగాలి తప్ప దేశ వ్యాప్తంగా కుల గణన సాధ్యం కాదని తేల్చి చెప్పారు. తమిళనాడులో చేసిన విధంగా చేస్తే స్వాగతిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణనకు చట్టబద్ధత ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామికి కట్టుబడి కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. లేకుంటే ప్రజలు, రైతులు తరుపున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, మాజీ పార్లమెంట్ సభ్యుడు సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, జిల్లా అధ్యక్షులు గంట రవి, సంతోష్ రెడ్డి, పూర్వ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కాళీ ప్రసాద్, వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్ షా, జిల్లా కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ బైరి మురళీకృష్ణ, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, తదితర నాయకులు, రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com